ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 26 ఫిబ్రవరి 2025 | 5






మహా.. శివుడు



మండపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివుడు మన చెంత కొచ్చాడు.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో కొలువయ్యాడు.. దేశంలో ఆదియోగి భారీ విగ్రహాలు కోయంబత్తూరు, బెంగళూరుల్లో 112 అడుగులు చొప్పున రెండు ఉన్నాయి. ద్వారపూడిలో మూడోది కొలువుదీరింది. 60 అడుగుల ఎత్తు, 100 అడుగులు వెడల్పుతో నిర్మించిన ఈ విగ్రహాన్ని మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం 5.30 గంటలకు ఆవిష్కరించనున్నారు. తమిళనాడుకు చెందిన ఎస్ఎల్ కనకరాజు చాలా ఏళ్ల కిందట ద్వారపూడి వచ్చి అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. ఆయన ఇటీవల బెంగళూరులోని తన కుమారుడి వద్దకు వెళ్లినప్పుడు అక్కడ ఆదియోగి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ద్వారపూడిలో కూడా ఇలాంటి విగ్రహం ఏర్పాటు చేయాలని బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన శిల్పి పడాల పెదరాఘవను సంప్రదించారు. పది నెలల్లో రూ.30 లక్షలు ఖర్చుచేసి విగ్రహాన్ని ఇలా తయారు చేశారు. విగ్రహం వెనుక భాగం లోపల శివలింగంతోపాటు 40 మంది వరకు కూర్చుని ధ్యానం చేసుకునేలా ఏర్పాటు చేశారు. విగ్రహం ముందు వినాయకుడు, కుమారస్వామి, నాలుగు వైపులా వశిష్ఠ, అత్రి, గౌతమ, కశ్యప, జమదగ్ని, విశ్వామిత్ర, వాల్మీకి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

శివరాత్రికి ముస్తాబు



శివరాత్రి వెలుగులు : విద్యుత్ ధగధగల మధ్య పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయం

శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ధవళేశ్వరం అగస్తేశ్వరుడు

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి.. గోదావరి రేవులు సిద్ధమయ్యాయి.. ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళా నేపథ్యంలో శివరాత్రి ఉత్సవాలకు ప్రాధాన్యం పెరిగింది.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ప్రధాన ఆలయాలు ఉన్నాయి.. ఆయా ఆలయాలకు భక్తజనం పోటెత్తుతారు. ద్రాక్షారామ, కోటిపల్లి, కుండలేశ్వరం, మురమళ్లకు భక్తజనం తండోపతండాలుగా తరలివస్తారు.. ఈ సందర్భంగా ఆలయాలు.. గోదావరి రేవుల వద్ద పోలీస్ బందోబస్తు మధ్య ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. - లోపల పేజీల్లో

శివాలయానికో.. చరిత్ర!

శివాలయాలకు ఒక్కో ఊరిలో ఒక్కో పేరు.. ఆలయాలకు వెళతాం.. ఆ ఆది దేవుడిని దర్శించుకుని వచ్చేస్తాం.. ఆ ఆలయానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే ఆలోచనలో పడతాం.. ప్రతి ఆలయానికి ఆ పేరు రావడానికి ఓ చరిత్ర ఉంది.. అదేమిటో తెలుసుకోవాలనుందా.. అయితే ఒకసారి 6వ పేజీలోకి వెళ్లాల్సిందే మరి..

6

ప్రచారం ముగిసింది.. ఓటు మిగిలింది!

రేపే ఎమ్మెల్సీ పోలింగ్

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. గురువారం పోలింగ్ జరగనుంది. తూర్పుగోదావరి జిల్లాలో 62,970 మంది ఓటర్లకు 92 పోలింగ్ కేంద్రాలు, కోనసీమ జిల్లాలో 64,471 మంది ఓటర్లకు 95 పోలింగ్ కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 70,504 మంది ఓటర్లకు 98 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం అధికారులకు బ్యాలెట్ పత్రాలు పంపిణీ చేయనున్నారు. బరిలో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీపడతారు. హోరాహోరీగా సాగిన ప్రచారంలో అభ్యర్థులంతా ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రయత్నించారు. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రచారంలో ఎక్కడా చిన్నపాటి వివాదాలు తలెత్తలేదు. ప్రచారం ప్రశాంతంగా ముగిసింది.

7



మల్కిపురం మండలం గూడపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం. చిత్రంలో ఎమ్మెల్యే దేవవరప్రసాద్

జిల్లాలో ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కూటమి అభ్యర్థి 'పేరాబత్తుల' తరపున ప్రచారాన్ని హోరెత్తించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెసులుబాటు కల్పించండి: కలెక్టర్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ప్రశాంత పరిస్థితుల నడుమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని టీడీపీ, జనసేన కూటమితో పాటు వివిధ పార్టీల తరఫున పోటీలో ఉన్న అభ్యర్థుల కోసం వారి తరపు ముఖ్య నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో 39 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండగా వారిలో అతి తక్కువ మందికి మద్దతుగా ప్రచార కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా హోరెత్తాయి. టీడీపీ-జనసేన కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంకు మద్దతుగా జిల్లాలోని ఆ పార్టీ ముఖ్య నేతలంతా గత నెల రోజులుగా ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమిలో ఆయా పార్టీల శ్రేణులు రాజశేఖరం విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారాల్లో పాల్గొన్నారు. పట్టభద్రులైన ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఇక పీడీఎఫ్ తరపున బరిలో ఉన్న డి.వీరరాఘవులు కూడా ఉమ్మడి జిల్లాలో పర్యటించి ఉపాధ్యాయుల తో పాటు ప్రైవేటు యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఇక స్వతంత్రంగా బరిలో ఉన్న జీవీ సుందర్ కూడా ప్రచారంలో తనదైన శైలిలో ముందుకు వెళ్లారు. తనయుడి తరఫున మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా పోటీలో ఉన్న అభ్యర్థులంతా ఎవరికి వారే ఓటర్లను నేరుగా కలిసి తమ విజయానికి సహకరించాల్సిందిగా అభ్యర్థించారు. ఇక ఎన్నికల కోడ్ నామమాత్రంగానే అమలైంది.

ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించండి : కలెక్టర్ ఆదేశం

ఈ నెల 27వ తేదీన జరిగే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి వివిధ సంస్థల్లో పనిచేస్తున్న పట్టభద్రులైన ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు యాజమాన్యాలు సహకరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా జిల్లాలోని వ్యాపార, వాణిజ్య పారిశ్రామిక సంస్థలు, ఇతర ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు, అధికారులు, తమ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునేలా కార్యాలయానికి లేదా పని ప్రదేశానికి ఆలస్యంగా హాజరయ్యేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. ఇందుకోసం వారికి అనుమతి, షిఫ్టుల మార్పు, కొంత సమయం మేర విధుల నుంచి మినహాయింపు కల్పించాలని కోరారు.

ఓం నమశ్శివాయ..

ప్రతిక్షేత్రానికి ఓ నామం.. ప్రతి నామానికి ఓ ప్రాశస్త్యం

ప్రతీ శైవ క్షేత్రానికి ఓ ప్రత్యేక నామం.. పురాణ విశిష్టతలెన్నో.. 'ఉమ్మడి' గోదావరి ఆధ్యాత్మిక ధామం



ఆది దేవుడు శివుడు. సృష్టికి మూలకారకుడు అతడే. అందుకే పరమాత్మగాను, రుద్రుడిగానూ కొలుస్తాం. సదాశివుడు అంటే ఆది అంతం లేనివాడని అర్థం. అందుకే శివుడిని ఆరాధించని వాళ్లు అరుదు. ముఖ్యంగా మన గోదావరి జిల్లాల్లో ఉన్న శైవ క్షేత్రాలు ఇంకెక్కడా ఉండవేమో. పంచారామ క్షేత్రాల్లో రెండు మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ఉన్నాయి. ద్రాక్షారామ, సామర్లకోటల్లో అవి కొలువై ఉన్నాయి. ఇవిగాకుండా కోటిపల్లి శైవ క్షేత్రం ఎంతో ప్రసిద్ధి చెందింది. రాజమహేంద్రవరంలో కోటిలింగాల క్షేత్రం, పిఠాపురంలో పాదగయ, కోనసీమలో కుండలేశ్వరం విశిష్టమైన శైవక్షేత్రాలు. ఇలా ప్రధానమైన శైవ క్షేత్రాల స్థల పురాణాలు కూడా ఆసక్తికరమే. అసలు ఆయా శైవ క్షేత్రాల్లో శివుడికి ఆ పేర్లు ఎందుకొచ్చాయో తెలియజేసే ప్రత్యేక కథనం..

'కోటి'ఫలితాల క్షేత్రం




పురాణ ప్రసిద్ధిగాంచిన కోటిపల్లి

(ఆంధ్రజ్యోతి- కె.గంగవరం)

కోటిపల్లి పుణ్యక్షేత్రంలో ఏ పుణ్య కార్యం చేసినా కోటి ఫలితాలు సిద్ధిస్తాయని పురాణ ప్రసిద్ధి. గోదావరి నది ఒడ్డున ఉన్న కోటిపల్లి పుణ్యక్షేత్రంలో రాజరాజేశ్వరి సహిత ఛాయా సోమేశ్వరస్వామి, అమ్మవారితో కూడి కోటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సహిత సిద్ధి జనార్దనస్వామి వేంచేసి ఉన్నారు. బ్రహ్మాండ పురాణం ప్రకారం ఈ మూడు విగ్రహాలను ఇంద్రుడు, చంద్రుడు, కశ్యపమహర్షి ప్రతిష్ఠించారని చెబుతోంది. తాము చేసిన పాపాలు పోగొట్టుకోవడానికి ఇంద్రుడు ఉమాసమేతుడైన కోటేశ్వర లింగాన్ని, రాజరాజేశ్వరి సమేతుడైన ఛాయా సోమేశ్వరుడిని చంద్రుడు ప్రతిష్ఠించారని, సిద్ధి జనార్దనస్వామిని కశ్యప మహర్షి ప్రతిష్ఠించాడని, ఆయన క్షేత్రపాలకుడని అంటారు. ఈ క్షేత్రం గోదావరికి ఉత్తరపు ఒడ్డున ఉంది. గౌతమ మహర్షి దీన్ని ఇటువైపు మళ్లించాడని కథనం. ఇందులో స్నానాలు ఆచరిస్తే చేసిన సర్వ పాపాలు పోతాయని ప్రతీతి.

కోడి రూపంలో శివుడు





గయాసురుడిని సంహరించేందుకు కోడి రూపం ధరించి ఇక్కడ లింగరూపుడు అయ్యాడు పరమశివుడు. కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామిగా భక్తులతో పూజలు అందుకుంటున్నారు. ఇక్కడ గయాసురుడి విగ్రహం కూడా ఉంటుంది. గయాసురుడిని సంహరించినప్పుడు పాదాలు ఇక్కడ పడడంతో ఇది పాదగయగా ప్రసిద్ధి గాంచింది. పూర్వం గయాసురుడనే రాక్షసుడు ఉండేవాడు. ఇతను చేసే సత్కార్యాలు, దానధర్మాలతో ఇంద్రాదిపత్యం కలిగింది. త్రిలోకాలను పాలిస్తూ ప్రజల మన్ననలను పొందాడు. దీంతో దేవతలు త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను శరణు కోరారు. ఏదడిగినా దానమిచ్చే గుణమున్న గయాసురుని వద్దకు త్రిమూర్తులు మారువేషాల్లో వచ్చారు. లోకం సుభిక్షంగా ఉండాలని ఒక యజ్ఞం తలపెట్టామని, దానికి మీ సహకారం కావాలని కోరారు. దానికి గయాసురుడు అంగీకరించాడు. ఏడు రోజులపాటు జరిగే ఈ యజ్ఞానానికి భూమి, ఆకాశాలు పనికిరావని, నీ శరీరాన్నే వేదికగా చేయాలని కోరగా అంగీకరించాడు. ఆరు రోజులు పూర్తయిన అనంతరం ఏడవ రోజున తెల్లవారుజాము కాకుండానే శివుడు కోడి(కుక్కుటం) ఆకారం ధరించి కొక్కొరొకో అని కూత కూశాడు. దీంతో యజ్ఞం పూర్తయిందని భావించి గయాసురుడు యజ్ఞవేదికగా ఉన్న తన శరీరాన్ని కదిపాడు. దీంతో ఆగ్రహించిన త్రిమూర్తులు నీ వల్లే యజ్ఞం భంగం అయిందని, కనుక సంహరిస్తామని చెప్పి వరం కోరుకోమన్నారు. అతని కోరిక మేరకు గయాసురుడి శరీర భాగాలు పడినచోట పితృకార్యాలు చేసి గయాశ్రార్ధమస్తు గయ గయ అని ఉచ్చరిస్తే పితృకార్యం సఫలం అవుతుందని వరమిచ్చారు. అనంతరం గయాసురుడి శరీరాన్ని మూడు భాగాలు ఖండించారు. శిరస్సు బీహార్‌లోని గయలో పడగా శిరోగయ, నాభి ఒరిస్సాలోని జాజిపూర్‌నందు గల గయలో పడగా నాభిగయ, పిఠాపురంలో పాదములు పడడంతో పాదగయగా పిలువబడుతూ ప్రసిద్ధిగాంచాయి. గయాసురుని సంహరించడానికి శివుడు కోడిరూపాన్ని ధరించినందున ఈ క్షేత్రంలో స్వయంభువ కోడిరూపమున స్ఫటిక లింగాకారంలో వెలసి కుక్కుటేశ్వరుడిగా పూజలు అందుకొంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)



'కుండల'ఈశ్వరం



కుండలేశ్వరంలో వృద్ధ గౌతమిలో స్నానమాచరించి కుండలేశ్వరుని కరుణాకటాక్షాల కోసం అర్రులు చాస్తున్నామని పవిత్ర కాశీలోని పండితులు అంటుంటే తాను ఆశ్చర్యానికి లోనైనట్టు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారంటే కుండలేశ్వర విశిష్టత ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. అమలాపురానికి సమీపంలో వృద్ధ గౌతమీ నదీతీరాన కాట్రేనికోన మండలంలో ఉన్న కుండలేశ్వర క్షేత్రంలో సూర్యుని కుండలాల ఆకారంలో శివలింగాన్ని గౌతమముని ప్రతిష్ఠించారని పురాణ గాథ. కవి సార్వభౌముడు శ్రీనాథ మహాకవి తన భీమఖండంలో కుండలేశ్వరం గురించి రాశాడు. కోటిపల్లిలో సోమేశ్వరుడు గాక దక్షిణ భాగం నుంచి గౌతమముని తీసుకొచ్చిన గోదావరి నది ప్రవహిస్తూ సముద్రం కేసి వెళుతోంది. చాలా వేగంగా వెళుతున్న గోదావరికి సముద్రపు ఘోష వినిపించింది. దీంతో మహా వేగంతో పాతాళలోకంలోకి ప్రవేశించి ఈ సముద్రుడితో గోదావరి భేదించాలనుకుంది. గోదావరి ఆలోచనలను నదులన్నింటికీ నాథుడైన సముద్రుడు గ్రహించి పూజా ద్రవ్యాలను, తన కుండలాలను ఒక పళ్లెంలో ఉంచి గౌతమికి ఎదురెళ్లాడు. గౌతమి నదికి కోపం పోగొట్టడానికి సాష్టాంగ నమస్కారం చేసి, సూర్యభగవానుని తేజస్సుతో మెరుస్తున్న ఈ కుండలాలను నీకు బహుమతిగా ఇస్తున్నానని తెలిపాడు. లోగడ వరుణదేవుడి తపస్సు చేసి సూర్యుడి అనుగ్రహంతో వీటిని పొందాడని వివరించాడు. దీంతో గౌతమీ నది నెమ్మదించి అక్కడ ఈశ్వర ప్రతిష్ఠకి అంగీకరించింది. అదే కుండలేశ్వర క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. మరో విశేషం కూడా ఉంది. ఇక పార్వతీదేవి ఆజ్ఞమేరకు వ్యాస మహర్షి కాశీని వదిలిపెట్టి విశ్వేశ్వరుని దర్శించుకోలేని పరిస్థితుల్లో అనేక క్షేత్రాలను దర్శిస్తూ కుండలేశ్వరం వచ్చాడు. దక్షయజ్ఞం తర్వాత యోగాగ్నిలో దగ్ధమైన సతీదేవి చెవి కుండలం పడిన ఈ క్షేత్రంలో గోదావరి స్నానం చేసి కుండలేశ్వరుని ఆయన దర్శించి కాశీవిశ్వేశ్వరుడిని దర్శించిన అనుభూతిని పొందాడు. అప్పుడు ఈ నదికి ఒక వరమిచ్చాడు. దేశంలో అన్ని నదులకు 12 ఏళ్లకు ఒకసారి పుష్కరం వస్తే, ఇక్కడ ప్రతిరోజూ పుష్కరమేనని వరం ప్రసాదించాడు. దాంతో గోదావరి పాయగా ఉన్న ఈ వృద్ధ గౌతమిలో ఏరోజు స్నానం చేసి పుష్కర స్నాన ఫలం పొందుతారు.

(ఆంధ్రజ్యోతి -కాట్రేనికోన)

కోటి లింగాల క్షేత్రం..



(ఆంధ్రజ్యోతి- రాజమహేంద్రవరం సిటీ)

కాశీ తర్వాత అంత ప్రాముఖ్యత కలిగిన క్షేత్రంగా రాజమహేంద్రవరం ఉమాకోటిలింగేశ్వర క్షేత్రానికి పేరుంది. చారిత్రక రాజమహేంద్రవరంలో పదవ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించారని చెబుతారు. పూర్వకాలంలో పరమశివుడు శివతాండవంలో శివుడు జటాజూటలో కొన్ని జటాజూటాలు రాలి గోదావరి తీరాన పడ్డాయని. అవి శివలింగాలుగా మారి కోటిలింగాలుగా అవతరించాయని పురాణ కథనం. ప్రస్తుతం కోటిలింగేశ్వరుడు కొలువై వున్న ఈ క్షేత్రంలో అంతర్ భూగర్భంలో కోటి శివలింగాలు ఉన్నాయని చెబుతారు. శ్రీరామచంద్రుడు వనవాస కాలంలో ఈ ఆలయాన్ని సందర్శించారనే చరిత్ర కూడా ఉంది. అందుకే ఈ ఆలయంలో రామాలయం కూడా ఉంది. శ్రీసీతారాములు విగ్రహాలు కూడా కొలువై పూజలు అందుకుంటాయి. ఉమాకోటిలింగేశ్వరస్వామి కొలువైన ఈ ప్రాంతంలో ఉన్న గోదావరి రేవుకు కోటిలింగాల రేవుగా పిలుస్తారు. దేశంలో ఎక్కడెక్కడ నుంచో వచ్చి చితాభస్మాన్ని కోటి లింగాల రేవులోనే నిమజ్జనం చేస్తారు.

కేదారేశ్వరా..



బిక్కవోలు, (ఆంధ్రజ్యోతి):తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బిక్కవోలులో తూర్పు చాళుక్యుల కాలంలో నిర్మించిన కేదారేశ్వరస్వామి ఆలయంలో స్వామిని మహాశివరాత్రి రోజున మాత్రమే పూజలందుకుంటాడు. 1100 ఏళ్ల కిందట ఈ ఆలయాన్ని నిర్మించారు. పిండారీలు, మహ్మదీయుల దండయాత్రలో ఆలయాన్ని ధ్వంసం చేయగా 15 ఏళ్ల కింద నుంచి కేంద్ర పురావస్తు శాఖ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి నుంచి గ్రామస్తులు మహాశిరాత్రి రోజున స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయం ముందు దీపాలు వెలిగించడానికి అరప కూడా ఏర్పాటు చేశారు. అలాగే గురువారం మధ్యాహ్నం స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

దక్షిణ కాశీ..ద్రాక్షారామ



దక్షిణ కాశీగా పేరొందిన అతిప్రాచీన శైవక్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయం. ఇది పంచారామ క్షేత్రం కూడా. రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామ గ్రామంలో ఉంది. పురాణకథనం ప్రకారం దేవతలు, రాక్షసులు పాలసముద్రాన్ని మథించిన సమయంలో ఆత్మలింగం ఉద్భవించింది. దీనిని తారకాసురుడు అనే రాక్షసుడు మెడలో ధరించి శివుని కోసం ఘోర తపస్సు చేస్తాడు. శివుడు ప్రత్యక్షమై దేవతలపై యుద్ధం చేయ సంభవించిన పక్షంలో తనపైగాని తన సంతతిపైగాని యుద్ధం చేయనంతవరకు అతడికి మరణం సంభవించదని వరమిస్తాడు. కాలగమనంలో దేవాసురుల సంగ్రామంలో శివుని కుమారుడు కుమారస్వామితో తారకాసురుడు తలపడతాడు. దీంతో తారకాసురుడి శిరస్సు వేయి ఖండాలుగాను, ఆత్మలింగం ఐదు ఖండాలుగాను అవుతుంది. ఆత్మలింగం శకలాల్లో ఒకటి ఇంద్రునిచే అమరావతిలో, రెండవ శకలం చందునిచే భీమవరంలో, మూడవశకలం శ్రీరామునిచే పాలకొల్లులో, నాలుగవ శకలం సామర్లకోటలో, ఐదవ శకలం ద్రాక్షారామలో సప్తమహర్షులచే ప్రతిష్ఠించే సమయానికి స్వయంభువునిగా వెలసినట్టు కథనం. పాలసముద్రం మథన సమయంలో భీమమైన హాలాహలం జనించింది. శివుడు భువనసంహారకమైన హాలాహలాన్ని మింగి కంఠాన ధరించాడు. భీమమైన కాలకూట విషం మింగి రక్షించడంతో భీమేశ్వరునిగా ఖ్యాతి చెందాడని చెబుతారు. చరిత్రపరంగా మొదటి చాళుక్య భీముని కాలంలో భీమేశ్వరాలయం 892-922 మధ్య నిర్మించినట్టు శాసనాల ద్వారా తెలుస్తోంది. చాళుక్యభీమునిచే నిర్మించిన ఆలయం భీమేశ్వరాలయంగా, భీమేశ్వరస్వామిగా పేర్కొన్నట్టు చెబుతారు. చాళుక్యభీముడు పాలించిన ప్రాంతం భీమమండలంగా ఉండేది. భీమేశ్వరస్వామి కేంద్రంగా అంతర్వేది నుంచి పట్టిసీమ వరకు భీమమండలం ఉందని, భీమమండలంలో 116 శివలింగాలు శివాలయాలు ఉన్నట్టు చెబుతున్నారు. ఇందుకు తార్కాణంగా శివలింగాలతో కూడిన భీమసభ ఆలయంలో ఉంది.

● (ఆంధ్రజ్యోతి -ద్రాక్షారామ)

కుమారరామ..భీమేశ్వర



సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామభీమేశ్వరుడు కూడా పంచారామ క్షేత్రాల్లో ఒకటి. ఆత్మలింగ నాలుగో శకలం ఇక్కడ పడడంతో అది గొప్ప శైవ క్షేత్రంగా పేరొందింది. కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయాన్ని క్రీ.శ. 892 నుంచి 922 వరకూ తూర్పు చాళుక్య రాజుల కాలంలో నిర్మించారు. దాంతో ఇది కూడా చాళుక్య భీముడి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. శ్రీకుమార రామ భీమేశ్వరస్వామి వారి దేవేరిని ఇక్కడ శ్రీబాలాత్రిపురసుందరి అని అమ్మవారిగా పిలుస్తారు. అదేవిధంగా పురాణ కథనం ప్రకారం తారకాసురుడిని కుమారస్వామి వధించడంతో కుమార రామ భీమేశ్వరుడిగా ప్రసిద్ధి చెందినట్టు చెబుతారు.



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారిణులు

మగువలు... మెరికలు

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటులో సత్తా చాటుతున్న మహిళలు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. మహిళల విభాగంలో జరిగిన మూడు మ్యాచ్‌లను డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు పర్యవేక్షించారు. సెంట్రల్ సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 1-0 తేడాతో విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 10-2 తేడాతో విజయం సాధించింది. రాజస్థాన్, కేరళ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో రాజస్థాన్ సెక్రటేరియట్ 2-0 తేడాతో విజయం సాధించింది.





క్రీడాకారిణుల విజయోత్సాహం



శివయ్యా... స్వాగతమయ్యా

అనపర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకుని అనపర్తిలోని శ్రీసత్య డ్రాయింగ్ అకాడమీ విద్యార్థి మందపల్లి శ్రీచరణ్ కుంచె నుంచి జాలువారిన శివుని చిత్రం ఆకట్టుకుంటోంది.



భక్తులకు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపేందుకు రెండు రోజులు కష్టపడి కలర్ పెన్సిళ్లతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్టు చరణ్ మీడియాకు తెలిపాడు.



సైకత శివం మహా సందేశం

'ఆది దంపతులు శివపార్వతుల అన్యోన్యం నేటి తరానికి ఆదర్శం' నినాదంతో తూర్పు గోదావరి జిల్లా రంగంపేటకు చెందిన ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ సైకత శిల్పం రూపొందించారు. సంస్కృతి, సంప్రదాయలను కాపాడాలని కోరుతూ మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తీర్చిదిద్దిన ఈ సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. శిల్పి శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

(ఆంధ్రజ్యోతి, రంగంపేట)

పొట్టలో పరమేశ్వరుడు



కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రామారావుపేటలోని ఆది గురు యోగా పీఠం వ్యవస్థాపకుడు, యోగా గురువు సద్గురు సచ్చిదానంద యోగి తన పొట్ట కండరాలను శివలింగం ఆకృతిలో మలిచి భక్తులను అబ్బురపరిచారు. యోగాలోని నౌలి క్రియ అనే భంగిమ ద్వారా భక్తిభావం చాటుకున్నారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో యోగా పీఠంలో సామూహిక మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్టు సచ్చిదానంద చెప్పారు.

ప్రచారం ముగిసింది.. ఓటు మిగిలింది!

» రేపు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పోలింగ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచార సమరం సాఫీగా ముగిసింది. ఉభయ గోదావరి జిల్లాల్లో అటు టీడీపీ నేతలు, ఇటు మిగతా పక్షాల నేతలు పట్టభద్రులను కలిసి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి నువ్వానేనా అన్నట్టుగా ప్రచారం పూర్తి చేయగలిగారు. ఇప్పటికే నిరుద్యోగం తాండ విస్తుండగా పట్టభద్రులను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులంతా ప్రచారంలో చమటోడ్చారు. తమ కూటమి ప్రభుత్వం కారణంగానే పరిశ్రమలు రాబోతున్నాయని, మెగా డీఎస్సీతోపాటు యువతకు అనుకూలంగా ఉపాధి పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామనే హామీతో టీడీపీ బపలరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా రెండు విడతలుగా ముఖ్య నేతలతో భేటీ నిర్వహించారు. యువనేత నారా లోకేశ్ కూడా ఎమ్మెల్సీ స్థానాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు ఏక పక్షంగా ఉండాలనే విధంగా ఉత్సాహపరిచారు. ఉమ్మడి ఉభయగోదావరిలో విభజిత ఆరు జిల్లాలు ఉండగా వీటన్నింటిలోనూ ప్రచారంలో తెలుగుదేశం పైచేయి సాధించగలిగింది. క్షేత్రస్థాయి కేడర్ దగ్గర నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్లు, మునిసిపల్ చైర్మన్‌లు, ఎంపీపీలు దగ్గర నుంచి పార్లమెంటు సభ్యుల వరకు పట్టభద్రుల చుట్టూ పరిభ్రమించారు. ఉభయగోదావరి జిల్లాల్లో ఎక్కడా పట్టు జారకుండా పక్కాగా వ్యూహాత్మకంగానే ముందుకెళ్లారు. క్షేత్రస్థాయిలో ఉన్న పట్టభద్రులను కలిశారు. వీరంతా పోలింగ్ కేంద్రానికి వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రచారంలో పెద్దగా పార్టీల మధ్య వివాదాలు సృష్టించే వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్తలు పడ్డారు. కూటమి పక్ష ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో ఓటర్ల మద్దతుకు విశ్వప్రయత్నం చేశారు.

చూసి.. ఓటేయండి

పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు పక్షాన వివిధ పార్టీల నేతలు ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చాన్నాళ్లైనా ఇచ్చిన హామీలు నెరవేర్చుకోవడంలేదంటూ పట్టభద్రులకు వివరించి వారి మద్దతు పొందేందుకు ప్రయత్నించారు. శాసనమండలిలో ప్రజల పక్షాన గొంతు వినిపించేలా తమకు ఓటు వేయాలని మిగతా అభ్యర్థులు ఎవరంతట వారుగా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. మాజీ ఎంపీ హర్షకుమార్ సైతం వివిధ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ తన కుమారుడు జి.వి.సుందర్ పక్షాన ప్రచారం చేస్తూ టీడీపీపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. వైసీపీ మాత్రం లోతట్టుగా కూటమికి వ్యతిరేకంగా ఓట్లు వేయాల్సిందిగా తమ పార్టీ అనుకూల వర్గాలను ఇప్పటికే కోరింది. మండల స్థాయిలో కొందరు జోక్యం చేసుకుని ఈ విధంగా పరోక్ష ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకించి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య భారీగానే ఉన్నా ప్రచార శైలిలో మాత్రం ఎవరంతట వారుగానే వ్యవహరించారు.

ఉద్యోగ వర్గాలు ఏ వైపు?

ఈసారి పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్లుగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఎవరైనా ఎన్నికల విధుల్లో ఉంటే వారికి పోస్టల్ ఓటుకు అవకాశం ఇస్తారు. మిగతా వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఇప్పటికే ఉద్యోగులంతా తమ పక్షానే ఉన్నారని కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాల వరకు వెళ్లి తమ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఎలాగూ సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా ఉభయగోదావరి జిల్లాల్లో కూటమి పక్షానికి చెందిన వారే కావడంతో ఉద్యోగులు కూడా ఎక్కడా వ్యతిరేకత ప్రదర్శించకుండా ఇప్పటిదాకా జాగ్రత్తపడ్డారు. కూటమి ఊహిస్తున్నట్టుగా వీరందరి మద్దతు ఆ వైపే దక్కితే భారీ మెజార్టీ తథ్యమని అంచనా వేస్తున్నారు. ఇంకో వైపు కార్మికులు, ఇతర వర్గాల్లో కూడా ఈ ఎన్నిక పట్ల పెద్దగా ఆసక్తి లేకపోయినా క్షేత్రస్థాయిలో నేతల హడావుడితో పోలింగ్ కేంద్రం వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

నంబర్-1 కోసమే ఆరాటం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్‌పై ప్రాధాన్యత ఓటు ఒకటిగా ఎవరికి అత్యధికంగా లభిస్తుందో వారే చివరికి విజేతలవుతారు. దీంతో గడిచిన మూడు రోజులుగా ప్రాధాన్యత ఓటు ఒకటి తమకే వేయాలని, బ్యాలెట్‌లో మరెవరికీ ఈ సంఖ్యతో ఓటు వేస్తే చెల్లకుండా పోతుందంటూ మరీ ఓటర్లను చైతన్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తుండడంతో మొదటి ప్రాధాన్యత ఓటును ముందస్తుగా లెక్కిస్తారు. దీనిలో ఎవరైతే అత్యధికంగా ముందు వరుసలో ఉంటారో వారికే ఛాన్స్ దక్కడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే గడిచిన ఎన్నికల్లోను, అంతకు ముందు జరిగిన ఎన్నికల్లోను ప్రాధాన్యత ఓటు విషయంలో ఓటర్లు తడబడడంతో చెల్లని ఓట్లు వేల సంఖ్యలోనే నమోదయ్యాయి. ఒక్క 2019లో జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అప్పట్లో 13 వేలకుపైగా ఓట్లు చెల్లకుండా పోయాయి. ప్రాధాన్యత ఓటు విషయంలో ఒకరి కంటే మించి ఎవరికైనా నమోదు చేస్తే చెల్లదని అప్పట్లో చైతన్యపర్చకపోవడం వల్లే వేల ఓట్లు మురిగిపోయాయి. ఇప్పుడు తెలుగుదేశం దీనిని గమనించి తమ పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పేరు బ్యాలెట్‌లో వరుస సంఖ్య ఒకటిలో ఉండడం, ఓటర్లు కూడా దీనికి అభిముఖంగా ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్నుతో ఒకటి (సంఖ్య రూపంలో) నమోదు చేస్తే చాలంటూ ఇప్పటికే ప్రచారంలో హోరెత్తించారు. మిగతా అభ్యర్థులు కూడా తమకు ప్రాధాన్యత ఓటు ఇవ్వాల్సిందిగా పదేపదే ఓటర్లను ప్రసన్నం చేసుకునే విధంగా వ్యవహరించారు.

జిల్లాల వారీగా ఓటర్ల తుది జాబితా

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ట్రాన్స్ జెండర్	మొత్తం ఓటర్లు
అల్లూరి జిల్లా	12	2,842	1827	0	4669
కోనసీమ జిల్లా	95	37,114	27,355	2	64,471
తూ.గో. జిల్లా	92	36,361	26,606	3	62,970
ఏలూరు జిల్లా	66	24,704	17,571	7	42,282
కాకినాడ జిల్లా	98	42,463	28,072	5	70,504
ప.గో. జిల్లా	93	39,863	30,187	2	70,052
మొత్తం	456	1,83,347	1,31,618	19	3,14,984

రేపు పాఠశాలలకు సెలవు

ఏలూరు అర్బన్/భీమవరం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకుని ఉపాధ్యాయులందరూ ఓటు హక్కు వినియోగించుకు నేందుకు వీలుగా ఈ నెల 27న అన్ని పాఠశాలలకు ఎన్నికల సంఘం సెలవు ప్రకటించినట్టు అధికారులు తెలిపారు. అదే విధంగా 27న ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలకు ఏర్పాట్ల నిమిత్తం ముందు రోజు కూడా స్థానిక సెలవుగా ప్రకటించడం జరిగిందని తెలిపారు.

మద్యం విక్రయాలపై నిషేధం

కలెక్టరేట్ (కాకినాడ),ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు దృష్ట్యా పోలింగ్‌కు 48గంటల ముందు నుంచి మద్యం విక్రయాలపై నిషేధం విధించారని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు, ఈమేరకు ఒకప్రకటన విడుదల చేశారు. మంగళవారం 4గంటల నుంచి గురువారం సాయంత్రం 4గంటల వరకు మద్యం దుకాణాలు తెరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మార్చి 3వ తేదీన మద్యం విక్రయాలపై నిషేధం విధించాలన్నారు. క్లబ్బులు, స్టార్ హోటల్స్ రెస్టారెంట్లు, హోటల్స్‌లో ఆయా తేదీల్లో మద్యం అమ్మకూడదని తెలిపారు.

స్వేచ్ఛగా ఓటెయ్యండి : ఆర్వో

ఏలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని, పట్టభద్రులంతా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. పోలింగ్ కేంద్రానికి తగిన గుర్తింపు పత్రంతో వెళ్లి అధికారులకు చూపించి ఓటెయ్యాలన్నారు. ఓటరు గుర్తింపు ఉన్న పత్రంపై ఓటరు పేరు వద్ద సంతకం చేస్తే అనంతరం బ్యాలెట్ పేపర్ అందిస్తారన్నారు. ఇందులో అభ్యర్థుల పేర్లు, ఫొటోలే ఉంటాయని, ప్రాధాన్యతా క్రమంలో అధికారులు ఇచ్చిన పెన్‌తో ఓటెయ్యాలన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

పట్టభద్రుల నియోజకవర్గంలోని ఓటర్ల సౌలభ్యం నిమిత్తం హెల్ప్‌లైన్ నంబర్ 1950 లేదా 94910 41419 నంబర్లను ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినట్టు రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. హెల్ప్ లైన్ నంబర్లను ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఓటర్లు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నమెంటు

● ముస్తాబైన గొల్లవిల్లి క్రీడాప్రాంగణం ● ఫ్లడ్ లైట్లవెలుగుల్లో మ్యాచ్‌లు
● ఎనిమిది రాష్ట్రాల నుంచి ఆరు పురుషులు, మూడు మహిళా టీమ్‌లు రాక



వాలీబాల్ పోటీలకు సిద్ధం చేసిన గొల్లవిల్లి క్రీడా మైదానం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అరిగెల శ్రీరంగయ్య నేషనల్ వాలీబాల్ పోటీలకు కోనసీమ జిల్లాలోని గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణం ముస్తాబయ్యింది. ఈ నెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు టోర్నమెంటు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. ఎనిమిది రాష్ట్రాల నుంచి ఆరు పురుషుల, మూడు మహిళా టీమ్‌లు పాల్గొననున్నాయి. 1988 నుంచి వాలీబాల్ పోటీల నిర్వహణలో అంచెలంచెలుగా ఎదిగిన గొల్లవిల్లి వాలీబాల్ క్రీడా మైదానం జాతీయ, అంతర్జాతీయ ఆటగాళ్ల ప్రశంసలు అందుకుంది. ఆటగాళ్ల ప్రాక్టీసు నిమిత్తం ప్రత్యేక కోర్టును గతంలోనే ఏర్పాటు చేశారు. ఇప్పటికే గొల్లవిల్లి వాలీబాల్ కోర్టును రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ పరిశీలించడం జరిగింది. నాలుగు వేల మంది ప్రేక్షకులకు సరిపడే గ్యాలరీలు నిర్మించారు. మహిళలకు ప్రత్యేక గ్యాలరీ నిర్మించారు. వీఐపీలకు ప్రత్యేక వేదిక ఉంది. వాహనాలకు రెండు చోట్ల పార్కింగ్ స్థలాలు కేటాయించారు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ రాజేష్ క్రీడా ప్రాంగణానికి రాకపోకలకు ప్రత్యేక మార్గాలను నిర్దేశిస్తూ రూట్ మ్యాప్ రూపొందించారు. క్రీడాప్రాంగణంలో శాంతిభద్రతల ఏర్పాట్లపై టోర్నమెంటు ముఖ్య సలహాదారు అరిగెల నానాజీ, సాంకేతిక సలహాదారు వుండ్రు రాజబాబుతో చర్చించారు.

యువత చెమటోడుస్తున్నారు

టోర్నమెంటు అధ్యక్షుడు, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ

గొల్లవిల్లి వాలీబాల్ క్రీడా వేదిక వెలుగులు నలుమూలలా ప్రసరింప చెయ్యాలన్న లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సహకారంతో అరిగెల శ్రీరంగయ్య నేషనల్ టోర్నమెంటును ప్రారంభించాం. గొల్లవిల్లి వాలీబాల్ క్లబ్ యువతతో పాటు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి యువత ఈ టోర్నమెంటు నిర్వహణకు చెమటోడుస్తున్నారు.

తృతీయస్థానంలో గొల్లవిల్లి

గొలకోటి ఫణీంద్రకుమార్, పీడీ, టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి

నేషనల్ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహణలో గొల్లవిల్లి క్రీడా వేదిక ప్రస్తుతం దేశంలో మూడవ స్థానంలో ఉంది. వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో గొల్లవిల్లి టోర్నమెంటు రిజిస్ట్రేషన్ జరిగింది. నాలుగు రోజుల పాటు జరిగే పోటీలు లీగ్ పద్ధతిలో జరుగుతాయి.

ప్రాణాలను బలిగొన్న అతివేగం

» ధవళేశ్వరంలో ఘోర రోడ్డు ప్రమాదం
» ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అతివేగం రెండు ప్రాణాలను బలిగొంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక జాలరుపేటకు చెందిన నాగమళ్ళ ముత్యాలరావు (19), బొడ్డు వెంకటేష్(17) స్నేహితులు. మంగళవారం మధ్యాహ్నం 4గంటల సమయంలో బైక్‌పై కాటన్ బ్యారేజ్ వైపు నుంచి వస్తూ బ్యారేజ్ సమీపంలో రాజోలు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టెక్ చేయబోయారు. అదే సమయంలో ఎదు రుగా ఆటో వస్తుండడంతో ఆటోను తప్పించడానికి సడన్ బ్రేక్ వేసిన వేయగా బస్సు వెనుక చక్రాల కిందకు పడిపోవడంతో బస్సు కుడివైపు వెనుక చక్రం ఇద్దరు తలల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. రోడ్డుపై టైర్లను వేసి నిప్పు అంటించారు. సీఐ టి.గణేష్, ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలతో మాట్లాడి సముదాయించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్ర భుత్వాసుపత్రికి తరలించారు. నాగమళ్ల లక్ష్మణరావు, రాజేశ్వరి దంపతుల చిన్న కుమారుడు ముత్యాలరావు. 7వ తరగతి వరకు చదివి తండ్రికి చేపల వేటలో చేదోడువాదోడుగా ఉంటున్నా డు. ఎదిగి వచ్చిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లాడంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యా రు. కాగా వెంకటేష్‌కు తండ్రి వీరబాబు, ఓ అన్నయ్య, అక్క ఉన్నారు. తమ్ముడిని కోల్పోవడంతో వారి రోదన వర్ణనాతీతం. ఇద్దరు స్నేహితుల మృతితో జాలరిపేటలో విషాదయఛాయలు అలుముకున్నాయి





ముత్యాలరావు (ఫైల్‌ఫొటో)



వెంకటేష్(ఫైల్)

సంఘటనా స్థలం వద్ద మృతదేహాలు

ఎమ్మెల్యే గోరంట్ల పరామర్శ

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధవళేశ్వరం చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించారు. వారిని ఓదార్చి కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ఎటపాక ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద రీతిలో వివాహిత మృతి చెందిన ఘటన మంగళవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం టీపీవీడు పంచాయతీలోని సీతాపురం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయిప్రియ (27) ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నితో ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. అప్పుడే ఇంటికి వచ్చిన భర్త నాగభూషణం భార్యని చూసి వెంటనే మెడకు ఉన్న ఉరితాడు తీసి కిందకు దింపాడు. ఇరుపొరుగు వారిని పిలిచేలోపు అప్పటికే ఆమె మృతిచెందింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ అప్పలరాజు సంఘటనా ప్రదేశానికి చేరుకుని దర్యాప్తు నిర్వహించారు. వివాహిత తల్లిదండ్రులు, భర్త, మామను విచారించారు. అయితే ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యుల వేధింపులతోనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. కాగా ఆరేళ్ల క్రితం సాయిప్రియకు వివాహమైంది. ఆమెది తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం. పోలీసులు పోస్టుమార్టం అనంతరం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ అప్పలరాజు

ప్రేమ పేరుతో గర్భవతిని చేసిన వ్యక్తికి
పదేళ్ల జైలు శిక్ష, జరిమానా

అడ్డతీగల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని నమ్మించి గర్భవతిని చేసిన కేసులో నిందితుడికి పది సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధించిన సంఘటన గంగవరం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. అడ్డతీగల సర్కిల్ పరిధిలోని గంగవరం మండలం పాత రాయవరం గ్రామానికి చెందిన గూడేం. రాయుడు అనే యువకుడు అదే గ్రామానికి చేందిన యువతిని ప్రలోభపెట్టి పేమిస్తూ్నానని నమ్మబలికి ఆమెను గర్భవతిని చేశాడు. వివాహం చేసుకోవాలని యువతి అనేక పర్యాయాలు ప్రాధేయపడిన ఫలితం లేకపోవడంతో గంగవరం పోలీస్‌స్టేషన్‌లో 2023లో ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. అప్పటి అడ్డతీగల సీఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని రాజమండ్రి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఆ కేసు మంగళవారం తుది విచారణకు రావడంతో నేరం రుజువు కావడంతో నిందితుడికి రాజమండ్రి 8వ అడిషనల్ సెషన్స్ జడ్జి వై.బెన్నయ్య పదేళ్ల జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని అడ్డతీగల సీఐ నర్సింహమూర్తి తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

నక్కపల్లి, (అనకాపల్లి జిల్లా) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా వద్ద వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన బి.శ్యామ్‌ప్రసాద్(28) నక్కపల్లి మండలం వేంపాడు వద్ద ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తున్నాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడు ఎస్.సాయిబాబుతో కలిసి హెటిరో కంపెనీలో పనిచేస్తున్న మరో స్నేహితుడిని కలవడానికి బైక్‌పై బయలుదేరారు. వేంపాడు టోల్ ప్లాజా వద్ద ఓ లారీని తప్పించబోయి ఆగి ఉన్న మరో లారీని ఢీ కొన్నారు. దీంతో శ్యామ్‌ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా, సాయిబాబుకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై నక్కపల్లి సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్యామ్‌ప్రసాద్ (ఫైల్ ఫొటో)

రాగిజావ తాగి..
14 మంది విద్యార్థులకు అస్వస్థత



అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఉప్పలగుప్తం/అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చల్లపల్లి పంచాయతీ పరిధిలోని జగ్గరాజుపేట ప్రాథమిక పాఠశాలలో కలుషిత ఆహారం తిని 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు మధ్యాహ్న భోజన పథక నిర్వాహకురాలు పులిదిండి సుజాత అందజేసిన రాగిజావను తాగిన విద్యార్థులు తొలుత స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. అనంతరం 12.10 గంటలకు మధ్యాహ్న భోజనంలో భాగంగా పులిహోర, దొండకాయ కూర కలిపి తిన్నారు. అప్పటికే రాగిజావ తాగిన 28 మంది విద్యార్థుల్లో 14 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. 5వ తరగతి చదువుతున్న మాదే అభిలాష్ వరుసగా 12 పర్యాయాలు వాంతులు చేసుకుని నీరసించి పోయాడు. పరిస్థితిని గుర్తించిన పాఠశాల హెచ్‌ఎం పి.వరలక్ష్మి అస్వస్థతకు గురైన విద్యార్థుల పరిస్థితిని ఎస్.యానాం పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి తెలియచేశారు. వెంటనే వైద్యాధికారిణి డాక్టర్ లోవసుధ అస్వస్థతకు గురైన విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించి వారిని ఉన్నత వైద్యం కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, పీఎంసీ చైర్మన్ మార్కండేయులు దగ్గరుండి విద్యార్థులకు సేవలందించారు. అయితే విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని తమకు ఎందుకు చెప్పలేదంటూ ఎంఈవో సత్తి సత్యకృష్ణ, తల్లిదండ్రులు హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథక నిర్వాహకురాలు రాగిజావ, పులిహోర, పచ్చడి తయారుచేసి పని ఉందని వెళ్లిపోయిన తీరుపై తల్లిదండ్రులు మండిపడ్డారు.

ఏరియా ఆసుపత్రికి తరలింపు
సమాచారం ఇవ్వలేదని
ఎంఈవో, తల్లిదండ్రుల ఆగ్రహం

విద్యార్థులకు వైద్య సేవలు

రాగిజావ తాగి అస్వస్థతకు గురైన విద్యార్థులను హుటాహుటీన అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో 2వ తరగతి చదువుతున్న నాతి దినేష్, దాసరి రోషన్‌తేజ్, మూడో తరగతి చదువుతున్న పోతుల అర్జున్, పెట్టా లక్ష్మి, బడుగు హారిక, మాదే నైనిష, మద్దెల ధనుష్, 4వ తరగతి చదువుతున్న పోతుల సుధాకర్, పోతుల సుహాసిని, మద్దెల రేణుక, 5వ తరగతి చదువుతున్న సాకా భార్గవకుమార్, మాదే దుర్గాశ్రీ, మాదే అభిలాష్, రొక్కాల నాగసత్యలకు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. సమాచారం అందుకున్న అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్లు వాసా ఎస్.దివాకర్, పలివెల అశోక్‌ప్రసాద్ ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్న సమాచారంతో తల్లిదండ్రులతో పాటు బంధువర్గీయులు, స్థానికులు అధిక సంఖ్యలో ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, బహుజన సమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు పరామర్శించారు.

ఆరోగ్యం మెరుగుపడింది : డీఈవో

అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ఇతర ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సాయంత్రానికి ఏడుగురు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగు పడడంతో డిశ్చార్జి చేశారు. మరో ఏడుగురు విద్యార్థులు వైద్యుల సంరక్షణలో చికిత్స పొందుతూ రాత్రికి డిశ్చార్జి చేయనున్నట్టు డాక్టర్ శంకరరావు తెలిపారు. ఇదిలా ఉండగా పాఠశాలలో ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ నిర్వాహకురాలిని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు తొలగించినట్టు డీఈవో తెలిపారు.



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆనందరావు

మారుతున్న రత్నగిరి రూపురేఖలు

అన్నవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం ఆఖరిస్థానం రావడం పరిస్థితులు మెరుగు కోసం ప్రభుత్వ పెద్దల సూచనతో సోమవారం స్వీయపర్యవేక్షణ చేయడంతో క్రమేపీ రూపురేఖలు మారుతున్నాయి. ముందుగా గతకొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న హరిహరసదన్ కాటేజీ పక్కనే ఉన్న మరుగుదొడ్లను శానిటేషన్ సిబ్బంది శుభ్రపరిచారు. సీఆర్వో కార్యాలయం వద్ద నగదురహిత సేవలను మంగళవారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తులు వేచిఉండకుండా బఫే విధానం అమలుచేయాలనే కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈవో వీర్ల సుబ్బారావు ప్రస్తుత భవన పైఅంతస్తు పరిశీలించి త్వరితగతిన అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దళారీ వ్యవస్థను అరికట్టేందుకు సెక్యూరిటీ విభాగం సూపరింటెండెంట్ ఐవీ రామారావు సెక్యూరిటీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రోటోకాల్ పరిధిలో ఉన్నవారికి మాత్రమే ప్రత్యేక క్యూ ద్వారా పంపించాలని, కిందిస్థాయి సిబ్బందిఎవ్వరు తీసుకొచ్చిన తూర్పురాజగోపురం నుంచే పంపించాలని అడ్డదిడ్డంగా పంపకుండా చూడాలని ఆదేశించారు.



మరుగుదొడ్లను శుభ్రపరుస్తున్న శానిటేషన్ సిబ్బంది

నేడు సరస్వతీ పూజ

త్వరలో జరిగే ఇంటర్, పదవ తరగతి, ఇతర ముఖ్య పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలనే ఆకాంక్షతో బుధవారం అన్నవరం దేవస్థానంలో సరస్వతీ పూజ నిర్వహించనున్నట్టు ఈవో వీర్ల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిత్య కల్యాణమండపంలో జరిగే ఈ కార్యక్రమంలో సరస్వతీపూజ అనంతరం స్వామిచెంతన ఉంచిన కలములు ఉచితంగా బహూకరించనున్నారు. అనంతరం వారికి సత్యదేవుడి ప్రత్యేకదర్శనం, అన్నదాన విభాగంలో ఉచిత అన్నప్రసాద సౌకర్యం కల్పించామని, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు అంతర్ రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు సెలవు

ఆలమూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి జాతీయ రహదారిపై ఉన్న అంతర్ రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు ఈనెల 26న మహాశివరాత్రి సందర్భంగా సెలవు ప్రకటించారు. వ్యాపారులు, రైతులు గుర్తించి మార్కెట్‌కు కూరగాయలు తీసుకురావద్దని సూచించారు.

విజయేంద్రసరస్వతి స్వామీజీ పుట్టినరోజు వేడుకలు

అంబాజీపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి పుట్టినరోజు వేడుకలను ముక్కామల నాదస్వర పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సరస్వతి స్వామీజీ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు నాద స్వరాలతో స్వామికి స్వరాభిషేకం చేశారు.

యానాంలో జడ్జి పర్యటన

యానాం, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): యానాంలో పుదుచ్చేరి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి డి.వి. ఆనంద్ పర్యటించారు. యానాంలో రెండు రోజుల పర్యటనకు పుదుచ్చేరి నుంచి యానాం వచ్చారు. స్థానిక ప్రభుత్వ అతిథిగృహం వద్ద ఆయనకు పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగానందం స్వాగతం పలికారు.

అమలాపురం డివిజన్‌లో 45 పోలింగ్ కేంద్రాలు: ఆర్డీవో

అల్లవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అమలాపురం డివిజన్‌లో 45 పోలింగ్ కేంద్రాల్లో 35వేల మంది గ్రాడ్యుయేట్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఆర్డీవో కె.మాధవి అన్నారు. అల్లవరం జడ్పీ హైస్కూలులో 2, అభ్యుదయ పాఠశాలలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని బుధవారం పోలింగ్ అధికారులకు బ్యాలెట్లు అందజేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఆరోగ్య శిబిరం, తాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి అమలాపురంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్ ఎంవీఎల్ నరసింహం, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, ఈవోపీఆర్డీ యు.నాగేంద్ర, డిప్యూటీ తహసీల్దార్ అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆర్ఐ కోడూరి మన్యం, ఎస్ఐ జి.హరీష్‌కుమార్ పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ముమ్మిడివరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను అమలాపురం ఆర్డీవో కె.మాధవి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించి ముమ్మిడివరం మండల పరిధిలో 3107 ఓటర్లు ఉండగా ముమ్మిడివరం జడ్పీ బాలుర పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు, బాలికల పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిని అమలాపురం ఆర్డీవో మాధవి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు సంబంధించి కెమెరాల ఏర్పాటు, పోలీసు బందోబస్తు, ఏపోలింగ్ కేంద్రాల్లో ఎంతమంది ఓటర్లు ఉన్నారో అనే వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలు అనువుగా ఉన్నాయా లేవా అనే విషయాన్ని పరిశీలించి బందోబస్తుకు సంబంధించి ఎస్ఐ డి.జ్వాలాసాగర్‌కు సూచనలిచ్చారు. ఆమె వెంట తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఎంపీడీవో తాడి వేంకటాచార్య, డీటీ గోపాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వీఆర్వోలు ఉన్నారు.

జిప్మెర్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలి



అధికారులతో సమీక్షిస్తున్న జిప్మెర్ డైరెక్టర్ నేగి, ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిప్మెర్ ఆసుపత్రి యానాంలో పూర్తిస్థాయి వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. రెండు రోజులు పర్యటనకు యానాం వచ్చిన జిప్మెర్ డైరెక్టర్ డాక్టర్ వీరసింగ్ నేగితో మల్లాడి భేటీ అయ్యారు. యానానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. యానాంలో ఉన్న ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో యానాంలో ఉన్న సదుపాయలు ఇంకా ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఢిల్లీ ప్రతినిధి మల్లాడి మాట్లాడారు. రూ.100కోట్లతో యానాంలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటైన జిప్మెర్ కన్సల్టింగ్ యూనిట్‌ను వర్చువల్ విధానంలో ప్రధాని వెదీ ప్రారంభించి నేటికి ఏడాది పూర్తయిందన్నారు. ఈ ఆసుపత్రిని కేవలం 80వేల జనాభాకు కాదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు దృష్టిలో ఉంచుకుని సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈఅంశాలపై కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖకు వివరిస్తామన్నారు.

యానాం వచ్చిన జిప్మెర్ డైరెక్టర్ డాక్టర్ వీరసింగ్ నేగిని పలువురు నేతలు కలిసారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, బీజేపీ శాఖ యానాం అధ్యక్షుడు కనకాల రాజు బృందం, కాంగ్రెస్ పార్టీ యానాం నాయకులు కాంటంశెట్టి రామూర్తి, దినేష్ తదితరులు కలిసి యానాం సమస్యలను వివరించారు.

వైభవంగా శ్రీభీమేశ్వర కల్యాణం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి శ్రీభీమేశ్వరా ఆడిటోరియంలో సోమవారం రాత్రి భీమేశ్వరస్వామి దివ్య కల్యాణం వైభవంగా జరిగింది. సత్యవాడ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ఆలయ ప్రధాన పూజారి భైరవబొట్ల వెంకటసుబ్రహ్మణ్యం(నాని) పర్యవేక్షణలో గౌరీశంకర్ సారథ్యంలో కార్తికేయ కల్యాణ పూజలు నిర్వహించారు. లక్కీడిప్ నిర్వహించి మహిళలకు చీరలు, ఇతర బహుమతులు అందించారు.

రూ.35వేలు ఆర్థిక సాయం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు నల్లా వీర్రాజు అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు ఆర్థిక సాయం అందించారు. వీర్రాజు భార్య పోలమ్మకు రూ.25వేలు అందించారు. వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ రూ.10వేలు అందించారు. ఉప్పుగంటి సుబ్రహ్మణ్యం, పుత్సల ఏసు, దాసరి శర్మ, అడబాల సురేష్, అత్తిలి గోపి, కాశిన అప్పారావు, బళ్ల లక్ష్మణ్, సూరిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీలు విజయవంతం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ఫిజికల్ సైన్స్ ఫోరం, జిల్లా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ మాస్టర్లుగా బ్రహ్మానందం, మేడిచర్ల శ్రీనివాస్ వ్యవహరించారు. 8,9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ఫోరం అధ్యక్షుడు బెహరా మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో ఎన్.బేబిరిషిత(మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలు), సి.జ్యోతి, బి.నందన (బండారులంక జడ్పీహైస్కూలు) ప్రథమ స్థానం సాధించగా ఎం.హరిషి (చెముడులంక), డీవీఎస్ఎన్ నాగసాయి, డి.సాయితేజ, పి.జోత్స్న (ద్వితీయస్థానం), ఎన్.కార్తీక, వై.జోషిత, ఏవీకే ప్రవల్లిక, వై.అక్షిత, (పి.లక్ష్మీవాడ) తృతీయస్థానం సాధించారు. విజేతలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్కే. సలీంబాషా, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, లక్ష్మణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి సీవీఎస్ సుబ్రహ్మణ్యం అభినందించారు. జిల్లాస్థాయి క్విజ్ పోటీల విజేతలకు సైన్స్ ఫోరం కార్యవర్గ సభ్యులు ఎస్.రాజరాజేశ్వరి, విజయకుమారి సర్టిఫికెట్లు అందజేశారు. జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం రోజున విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు.



జిల్లాస్థాయి క్విజ్ పోటీల విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రాజరాజేశ్వరి

దోమల నివారణకు చర్యలు

అమలాపురంటౌన్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ బీఎల్ఎన్ కుమార్ తెలిపారు. మంగళవారం అమలాపురం మున్సిపల్ కాలనీ, ఉప్పర్ల కాలనీల్లో ఆయన పర్యటించి నిల్వచేసిన నీటిని, ఇతర వ్యర్థాలను పరిశీలించారు. మలేరియా దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానికులకు వివరించారు.

దీన్‌దయాల్ అంత్యోదయ కమిటీ సభ్యుడిగా కొండ



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన ద్వారా ఆసరా కల్పించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రతీ కార్పొరేషన్, పురపాలక సంఘాల్లో కమిషనర్‌ను చైర్మన్‌గా ప్రకటించగా స్థానిక అధికారులను భాగస్వాములను చేసింది. ఈకమిటీలో అమలాపురం పట్టణానికి చెందిన ఆజాద్ ఫౌండేషన్ సభ్యుడు యల్లమిల్లి నాగసుధాకొండలరావును అమలాపురం పురపాలక సంఘం, ముమ్మిడివరం నగర పంచాయతీలకు కమిటీ సభ్యునిగా ఎంపిక చేశారు. ఈకమిటీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తుందని కొండ తెలిపారు. ఈసందర్భంగా కొండను పలువురు అభినందించారు.

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించండి

పలుచోట్ల ఎన్నికల ప్రచారం

మలికిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తనకు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి అత్యధిక మెజార్టీ కల్పించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గూడపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ పాలనలో పట్టభద్రులకు ఎన్నో మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు విజన్ ఉన్న నాయకుడని, ఆయన నేతృత్వంలో ఎన్డీఏ హయాంలో రాష్ట్రం బంగారు బాటలో పయనిస్తుందన్నారు. మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ రాజశేఖరం విజయం ఖాయమని, కార్యకర్తలు అధిక మెజార్టీ రావడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. మట్టపర్రు, లక్కవరం, ఇసురుమండ, గుబ్బలపాలెం, గూడపల్లి గ్రామాల్లో రాజశేఖరంకు మద్దతుగా ఎమ్మెల్యే వరప్రసాద్, మాజీ మంత్రి సుజాత ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు కేతా శ్రీను, ఎంపీ సత్యవాణి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, భూపతిరాజు సాయిబాబురాజు, మల్లిపూడి సత్తిబాబు, చెల్లుబోయిన శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రెడ్డివారిపాలెంలో ప్రచారం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు 1వ ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలని టీడీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు (బాలు) విజ్ఞప్తి చేశారు. మంగళవారం కొమానపల్లిలో రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మొల్లివారిపేట, పెదపేట, చినపేట, కొమ్ములవారిపేట, అంబేడ్కర్ నగర్, రెడ్డివారిపాలెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పెన్మెత్స కృష్ణవర్మ, కుంచనపల్లి నారాయణ, మారెళ్ల శ్రీనివాసరావు, షేక్ సుభాన్‌సాహెబ్, ముమ్మిడివరపు వరలక్ష్మి, ముమ్మిడివరపు శ్రీనివాస్, మొల్లి వెంకటరత్నం పాల్గొన్నారు.



ఉప్పలగుప్తం:గొల్లవిల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అబ్జర్వర్ కర్రోతు బంగార్రాజు

మొదట ప్రాధాన్యతా ఓటు వేయాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు దువ్వారపు రామారావు, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు కోరారు. అంబాజీపేట పరిశోధన కేంద్రం, మాచవరం గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర ఇరిగేషన్, శెట్టిబలిజ, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్లు శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, మోకా ఆనందసాగర్, నాయకులు షేక్ సుభాన్, గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, అరిగెల సూరిబాబు, దొమ్మేటి సాయి కృష్ణ, కొర్లపాటి గోపి, ఖైపాల తాతాజీ, అరిగెల బలరామమూర్తి, పెదపూడి శ్రీను, నేదునూరి పెద్దిరాజు, దొమ్మేటి రామారావు, శ్యామ్, సుంకర బాలాజీ, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

రాజశేఖరాన్ని గెలిపించండి

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలంటూ కూటమి నాయకులు గొల్లవిల్లిలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హైస్కూల్లో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజశేఖరం గెలుపు కోసం ప్రచారం

మామిడికుదురు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలంటూ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు ముఖర్రం హుస్సేన్ కోరారు. మంగళవారం మామిడికుదురు, నగరం గ్రామాల్లో పర్యటించి పట్టభద్రులను కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మామిడికుదురు సర్పంచ్ గైస్ మొహిద్దీన్, అప్పన రామకృష్ణ, బాజానీ, షంషూసాదిక్, ఫహద్ పాల్గొన్నారు.

నేడు లూర్థుమాత యాత్ర మహోత్సవం



లూర్థుమాత కొండగుడి

యానాం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): యానాంలోని రోమన్ కేథలిక్ చర్చి ఆవరణలో గల లూర్థుమాత ఆలయంలో బుధవారం యాత్ర నిర్వహించనున్నారు. సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా ఈవేడుక నిలుస్తోంది. ఈఆలయానికి మరో ప్రత్యేకత ఉంది. క్రైస్తవులే కాకుండా యానాం పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు కులమతాలకు అతీతంగా వచ్చి ప్రార్థనలు చేసి కొవ్వొత్తులు వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. ఎనిమిది రోజులుగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు నవదిన ప్రార్థనలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి చర్చిలో వాక్యపరచర్య, స్వస్థతా ప్రార్థనలు జరగనున్నాయి. సాయంత్రం 4.30గంటలకు విశాఖపట్నం అతిమేత్రాసనము పాలనాధికారి డాక్టర్ పొలిమేర జయరావుతో సమిష్టి దివ్య పూజబలి, అనంతరం లూర్థుమాత పురప్రదక్షణ నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

నిర్దేశిత గడువులోగా రీసర్వే పూర్తిచేయాలి : జేసీ

అమలాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత గడువులోగా భూముల రీసర్వే ప్రక్రియను ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి అదనపు కార్యదర్శి ఎస్.ప్రభాకర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జేసీ పాల్గొన్నారు. అనంతరం జేసీ నిషాంతి మాట్లాడుతూ ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామంలోని రైతులతో వాట్సాప్ గ్రూపును క్రియేట్ చేసి రీసర్వే వివరాలను ఎప్పటికప్పుడు పోస్టుచేసి ప్రతీ రైతుకు తెలియచేయాలని ఆదేశించారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణ పూర్తి చేయాలన్నారు. గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. కోనసీమ జిల్లాలో 17 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ జరుగుతుందన్నారు.

46గ్రాముల బంగారం చోరీ

పి.గన్నవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉడిమూడి శివారు చింతావారిపేట గ్రామానికి చెందిన కప్పల ఏడుకొండలు ఈనెల20న ఉదయం పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరం బంధువుల పెళ్లికి వెళ్లారు. నాలుగు రోజుల తర్వాత ఆయన ఇంటికి వచ్చారు. బీరువాలో ఉండాల్సిన 46గ్రాముల బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

డంపింగ్ యార్డుకు చెత్త తరలించవద్దని ఆందోళన

యానాం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): యానాంలో చెత్త వివాదం చోటుచేసుకుంది. డంపింగ్ యార్డులో చెత్త వేయవద్దని స్థానిక ఎమ్మెల్యేతో పాటు స్థానికులు హుకుం జారీ చేయడంతో రెండు రోజులుగా డంపింగ్ యార్డుకు చెత్త చేరడంలేదు. కనకాలపేటలోని డంపింగ్ యార్డు తొలగించాలని ఎన్నో ఏళ్లుగా ప్రజలు కోరుతున్నారు. అయితే అక్కడి నుంచి వేరొచోటికి తరలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినప్పటికి అక్కడ ఉన్న స్థానికుల నుంచి వచ్చిన వ్యతిరేకతతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే ఇక్కడ నుంచి తొలగించాలని స్థానికులు, ప్రజాప్రతినిధి ప్రభుత్వానికి వివరించారు. డంపింగ్ యార్డును తరలించక పోవడంతో రెండో రోజులుగా కనకాలపేట డంపింగ్ యార్డుకు చెత్త తీసుకురావద్దని పారిశుధ్య సిబ్బందికి స్థానికులు, ఎమ్మెల్యే హెచ్చరించడంతో పాటు ఆందోళనకు దిగారు. దీంతో ఎక్కడిచెత్త అక్కడే నిలిపోయింది. దీంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అంబాజీపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు అంబాజీపేట హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహశీల్దారు జె.వెంకటేశ్వరి పరిశీలించారు. హైస్కూల్‌లో మూడు పోలింగ్ కేంద్రాలుండగా, 2460మంది ఓటు హక్కు వినియో గించుకుంటారని ఆమె వివరించారు. ఆమె వెంట ఆర్ఐ ఏడుకొండలు, వీఆర్వోలు రమణ, రమేష్ ఉన్నారు.

నేడు శంకరనారాయణస్వామి బ్రహ్మసూక్త లింగప్రతిష్ఠ

అయినవిల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన బ్రాహ్మీ ముహూర్తంలో శంకరనారాయణస్వామి బ్రహ్మసూక్త లింగ ప్రతిష్ఠ యలకల్లంక గ్రామంలో నిర్వహించనున్నారు. గౌతమీ గోదావరి తీరంలో గల శ్రీకోదండరామ ఆలయం, శంకర నారాయణ క్షేత్రమందు ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నారు. గౌరీశంకరశర్మ ఆధ్వర్యంలో మంగళవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ హోమాలు నిర్వహించారు. శివలింగాన్ని గ్రామంలో ఊరేగించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

'విద్యుత్ ప్రమాద బాధితులను ఆదుకోకుంటే ఉద్యమిస్తాం'

అల్లవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గోడికొత్తకాలనీలో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో చేతిని కోల్పోయిన చిన్నారి కేతా లాస్యమాధురి, తల్లి రమాదేవి కుటుంబానికి విద్యుత్ శాఖ సహాయం అందించకుంటే ఉద్యమం చేపడతామని మానవహక్కుల వేదిక పేర్కొంది. మానవహక్కుల వేదిక కార్యవర్గ సభ్యుడు ముత్యాల శ్రీనివాసరావు ప్రమాద బాధితులను పరామర్శించి విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై మండిపడ్డారు. తండ్రి వెంకటరమణ దివ్యాంగుడని, విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వల్లే చిన్నారి మాధురి చేయిని తొలగించారని ధ్వజమెత్తారు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఆ కుటుంబానికి విద్యుత్‌శాఖ పూర్తిన్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రామేశ్వరంలో శివరాత్రి ఏర్పాట్లు

అల్లవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరామునితో శివలింగ ప్రతిష్ఠతో పురాణ ప్రసిద్ధి పొందిన రామేశ్వరంలో శివరాత్రి సందర్భంగా ఏర్పాట్లు చేశామని ఛైర్మన్ అంగాడి రామారావు తెలిపారు. సముద్ర స్నానాల అనంతరం వేలాదిగా భక్తులు పార్వతీ రామేశ్వరుని దర్శించుకుంటారన్నారు. సముద్ర స్నానాల వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో గజఈతగాళ్లను సిద్ధం చేశారు. ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో తీరంలో, రామేశ్వరాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గౌతమ్‌బాబు ప్రచారం

అల్లవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి కొల్లు గౌతమ్‌బాబు మండలంలో ఎన్నికల ప్రచారం చేశారు. తనను గెలిపిస్తే నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తానని అన్నారు. ఆయన వెంట పలువురు యువకులు ఉన్నారు.

జాతీయస్థాయి మారథాన్ అవార్డుకు ఎంపికైన శ్రీవల్లీ



అంతర్వేది, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మోరి జ్ఞాన సుబ్బమ్మ మెమోరియల్ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోన్న విద్యార్థిని సుంకర శ్రీవల్లీ గత డిసెంబరు నెలలో జరిగిన స్కూలు ఇన్నోవేషన్ మారథాన్ 2024 ఆన్‌లైన్ ప్రాజెక్టు పోటీల్లో భాగంగా వ్యర్థాల నిర్వహణ అంశంలో జాతీయస్థాయికి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీధర్‌కృష్ణ తెలిపారు. కోనసీమ జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన రెండు ప్రాజెక్టుల్లో మోరి పాఠశాల ఒకటని, సుంకర శ్రీవల్లీ రూపొందిన జీడిపప్పు పొట్టుతో సహజ ఎరువు తయారీ అనే ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల విద్యార్థినికి, గైడ్ టీచర్ ఏవీ గంగాప్రసాద్‌లను డీఈవో షేక్ సలాంబాషా, డీవైఈవో సూర్యప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి జీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ గుబ్బల శ్రీలక్ష్మి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్ పరీక్షలు: జేసీ

మార్చి 1 నుంచి 20 వరకు పరీక్షలు

జిల్లాలో 40 పరీక్షా కేంద్రాలు.. 27,313 మంది విద్యార్థులు

అమలాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా పటిష్టంగా ఏర్పాటు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీసు కాపీయింగ్ వంటి సంఘటనలు చోటు చేసుకున్నట్టయితే వెంటనే ఉన్నతాధికారులకు సీసీ కెమెరాల ఆన్‌లైన్ స్క్రీనింగ్ అనుసంధానంతో వెంటనే తెలుస్తుందని, క్షణాల వ్యవధిలో అటువంటి వాటిని అరికడతామన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల సన్నద్ధతపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరిగే పరీక్షలకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే కీప్యాడ్ సెల్‌ఫోన్ అనుమతి ఇస్తారన్నారు. ప్రశ్నాపత్రాలను 14 స్టోరేజీ పాయింట్లలో మూడు సెట్లు చొప్పున భద్ర పరుస్తారని, పరీక్ష తేదీ ఉదయం 8.30 గంటలకు ఎంపిక చేసిన ప్రశ్నావళి పత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలిస్తారు. మెడికల్ క్యాంపు నిరంతర విద్యుత్ సరఫరా తదితర అంశాలపై చర్చించారు. జిల్లాస్థాయిలో డీఈసీ స్క్వాడ్ ఒకటి ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు మాట్లాడుతూ జిల్లాలో 40 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 27,313 మంది విద్యార్థులు రాయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో రాజకుమారి, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, జిల్లా పరిషత్ కమిటీ డీఈసీ వై.లక్ష్మణరావు, ప్రత్యేకాధికారి కేఎస్‌వీఎస్ ఏసుబాబు, డీఈవో షేక్ సలీంబాషా, స్క్వాడ్‌ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలుచేస్తూ అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేసేందుకు అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని ఎంఈవో ఆర్.ఉదయభాస్కర్ సూచించారు. అంగన్‌వాడీ టీచర్లకు మండలస్థాయిలో ఆరు రోజులు నుంచి నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, మండల విద్యాశాఖాధికారి ఆర్.ఉదయభాస్కర్ పాల్గొని మాట్లాడారు. సీడీపీవో ఐ.విమల మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో అమలుచేస్తూ అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. మండల పరిధిలో ఉన్న 181 మంది అంగన్‌వాడీ వర్కర్లు ఈశిక్షణలో పాల్గొన్నారు. డీఆర్పీలు ఎన్.నాగరాజు, పి.హిమబిందు, పల్లవి, దేవి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

మలికిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మలికిపురం చంటిరాజు విల్లాస్‌లో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, మాజీ ఎంపీపీ జి.గంగాభవానీ, పెదకాపు, వెంకట్రామరాజు, ఎంపీ సత్యవాణి, బొక్కా గోవిందు, కేవీ రామకృష్ణంరాజు, పిండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మలికిపురం మండలంలో శివరాత్రి సందర్భంగా పలు గ్రామాల్లో శివపార్వతుల కల్యాణాలు వైభవంగా జరిగాయి.

ఘనంగా స్వామివారి శాంతి కల్యాణం



అంతర్వేది, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బహుళ ద్వాదశిని పురస్కరించుకుని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహించారు. తొలుత ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద స్వామివారి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి అలంకరించారు. అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహణం, మాంగళ్యధారణ తంతును వైభవంగా భక్తుల గోవింద నామస్మరణ మధ్య అర్చకులు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణేశుల వీరభద్రుని సంబరాలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో మంగళవారం గణేశుల వీరభద్రుని బోనం, జమ్మిచెట్టు పూజ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. లంకతల్లెమ్మవారి ఆలయం సెంటర్‌లోని గణేశులవారి స్వగృహం నుంచి గణేశుల బ్రహ్మానందం సోదరులు విభూది పండ్లను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో బాజాభజంత్రీలు, బాణసంచా కాల్పులతో ఊరేగింగా తీసుకువెళ్లారు. ముమ్మిడివరం షిర్డిసాయి ఆలయం వద్ద పవిత్ర నదీజలాల్లో స్నానాలు ఆచరించి, బోనం పూజ నిర్వహించారు. అక్కడ జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వీరభద్రుని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, నాయకులు పెన్మెత్స చిట్టిరాజు, గోదశి నాగేశ్వరరావు, కోలా బాబ్జి, చెల్లి అశోక్, ములపర్తి బాలకృష్ణ, జిన్నూరి సూర్యప్రకాశరావు, జిన్నూరి వెంకటేశ్వరరావు, కె.సోనీ, గంగి చక్రపాణి, ఆకుల మణిశంకర్, గణేశుల బ్రహ్మానందం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా సైన్స్‌ఎగ్జిబిషన్

మలికిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ విజ్ఞానదాయకంగా, పిల్లల్లో ఉన్న సృజనాత్మక ఆలోచనలు వెలికి తీసేందుకు వారధిగా ఉందని ఎంఈవో ఎం.విజయశ్రీ అన్నారు. ఇటువంటి ఎగ్జిబిషన్ల ద్వారా పిల్లల్లో నిగూఢమైన ఆలోచనలను వెలికి తీయవచ్చునన్నారు. పాఠశాలల్లో ఇటువంటివి ఏర్పాటు చేయడం విద్యాపరంగా, విద్యార్థుల పరంగా మంచి సంకేతాలు ఇస్తాయన్నారు. ఇదే పాఠశాలలో చదివిన విద్యార్థులు రాష్ట్రపతి ప్రశంసలు అందుకోవడం పట్ల అభినందనలు తెలిపారు. ప్రదర్శనలో వెర్టికల్ ఫార్మింగ్, సూసైడ్ ప్రివెన్షన్ ఫ్యాన్, ఫైర్ యాక్సిడెంట్ డిటెక్టర్, స్వచ్ఛభారత్, కాలుష్య నియంత్రణ, వర్షపు నీటిని సాగుకు ఉపయోగించే పద్ధతి, సోలార్ పంపుసైట్, న్యూటన్ నియమాలు, పర్యావరణ పరిరక్షణ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో 170 వరకు నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వీవీవీ ప్రసాద్, నల్లి శివ, బీర అశోక్, బోనం రాజు, తాడి సహదేవ్, పి.గణేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీకి గురుకుల పాఠశాల విద్యార్థిని ఎంపిక

రాజోలు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2024 జాతీయ స్థాయి పోటీకి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజోలు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని వై.విద్యాభాను ఎంపికైందని పాఠశాల ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరులో జరిగిన స్కూలు ఇన్నోవేషన్ మారథాన్ 2024 ఆన్‌లైన్ సైన్స్ ప్రాజెక్టు పోటీల్లో భాగంగా ప్రకృతి స్థిరమైన అభివృద్ధి అంశంలో గురుకుల బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ విద్యను అభ్యసిస్తున్న విద్యాభాను తయారుచేసిన బయో డిగ్రేడబులిటీ అనే ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైందని పేర్కొన్నారు. కోనసీమ జిల్లా నుంచి జాతీయస్థాయికి ఎంపికైన రెండు ప్రాజెక్టుల్లో శివకోడు పాఠశాల ఒకటి అని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని విద్యాభాను, గైడ్ టీచర్ జి.శ్వేతస్వర్ణలతను డీఈవో షేక్ సలీంబాషా, ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి జీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవో-1 ఎన్.మనోహరం, ఎంఈవో-2 టీఎస్కేడీ ప్రసాదరావు, ప్రిన్సిపాల్ లలితకుమారి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ ఛైర్మన్ పి.ఉమామహేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు తదితరులు అభినందించారు.

విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

రాజోలు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యునెస్కో 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ క్వాంటం శాస్త్ర టెక్నాలజీ సంవత్సరంగా ప్రకటించింది. దీనిలో భాగంగా బి.సావరంలో శోభన ఇంగ్లీషు మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ ఫాదర్ కె.జోసెఫ్, ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, హెచ్ఎం బెర్నా, అసిస్టెంట్ ఫాదర్ మార్కో ఆధ్వర్యంలో మంగళవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎంఈవో-1 ఎన్.మనోహరం, ఎంఈవో-2 టీఎస్కేడీ ప్రసాదరావు, ఉప సర్పంచ్ రావూరి నాగబాబు, కడియం పూర్ణచంద్రరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జడ్జిలుగా ఉపాధ్యాయులు ఎంఎల్ గణపతిరావు, కేఆర్ఎన్ పద్మావతి, గటిగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

త్రేత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

అంతర్వేది, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం గ్రామంలో శివరాత్రి పండుగను పురస్కరించుకుని త్రేత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక మామిడికుదురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. శివరాత్రి పండుగ విశిష్టతను ప్రజలకు వివరిస్తూ ప్రచారం సాగించారు. కార్యక్రమంలో బండారు సత్యనారాయణ, హనుమంతరావు, జగదీష్, అన్నపూర్ణ, సత్యవతి, బ్రహ్మాజీ, సుబ్బారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలోని ప్రతి విషయం విద్యార్థులకు వివరించాలి

పి.గన్నవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జ్ఞానజ్యోతి శిక్షణాకార్యక్రమంలో నేర్చుకున్న ప్రతి విషయాన్ని విద్యార్థులకు వివరించాలని ఎంపీడీవో కేవీ ప్రసాద్ సూచించారు. పి.గన్నవరంహైస్కూల్లో అంగన్వాడీలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేర్చుకున్న ముఖ్యమైన అంశాలను విద్యార్థులకు బోధిస్తే ప్రాథమిక పాఠశాలస్థాయిలో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆరు రోజులు ప్రతి రోజు 63మందికి శిక్షణ ఇచ్చామన్నారు. పి.గన్నవరం హైస్కూల్ హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, ఎంఈవోలు కె.హెలీనా, సీహెచ్ వీరభద్రానందం, హెల్త్‌అసిస్టెంట్ ఎం.శ్యామ్యూల్‌రాజు పాల్గొన్నారు.

ఘనంగా లక్షతులసి పూజ



వాడపల్లి వెంకన్న ఆలయంలో లక్షతులసిపూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి లక్షతులసి పూజా మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు వసంత మండపంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృత మండపారాధన, స్నపనమూర్తులకు అభిషేకం, హోమం అమ్మవారికి కుంకుమార్చన, లక్షతులసి పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధర రావు పూజలో పాల్గొన్నారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.58లక్షలు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,58,276లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. చిల్లర నాణేలతో చిన్నారులకు తులాభారం నిర్వహించారు. వకులమాత అన్నదాన భవన నిర్మాణానికి పెంటపాడు మండలం పరిమెళ్ళకు చెందిన రంగు శ్రీనివాస్ రూ.50,116, ఆచంట మండలానికి చెందిన కంఠంశెట్టి సత్యకృష్ణ రూ.30,116 విరాళాలు సమర్పించారు. దాతలకు స్వామివారిచిత్రపటాలను అందించారు.



రక్షిత మంచినీటి పథకం పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి, కౌన్సిలర్లు

రక్షిత మంచినీరు శుద్ధి లోపాలను పరిష్కరించండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి

ద్రాక్షారామ, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం పట్టణానికి వెల్లలో ప్లాంటు ద్వారా సరఫరా అవుతున్న రక్షితమంచినీరు శుద్ధి, సరఫరా లోపాలను నిపుణులతో చర్చించి పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం రామచంద్రపురం మండలం వెల్లలో రక్షిత మంచినీటి సరఫరా ప్లాంటును పరిశీలించారు. రంగుమారిన నీరు సరఫరా జరుగుతుందని ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో కౌన్సిల్ బృందం పరిశీలించారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, శాన్డ్ బెడ్లు, క్లారిఫైలు, లిఫ్టుపెంపు, క్లీర్ వాటర్ పంపు హౌస్, రహదారి, సమీపంలో కొబ్బరి చెట్లు, ఇతర మొక్కలను పరిశీలించారు. రంగుమారిన నీరు రావడం గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఇంజనీర్లను సంప్రదించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, డీఈఈ శ్రీకాంత్, వైస్‌చైర్మన్ కొలమూరి శివాజీ, చీఫ్‌విప్ సాయిప్రసాద్, కౌన్సిలర్లు అంకం శ్రీనివాస్, కేతా శ్రీను, నల్లా అంజమ్మ, తోట అమ్మాజీ, పెంటపాటి దేవి, పోతంశెట్టి శ్యామల, బాసిన నాగమణి, కోటిపల్లి లక్ష్మీశివాజీ, బావాల మంగామణి, గాదే సీతామహాలక్ష్మి, షెక్‌మస్తాన్ పాల్గొన్నారు.

టెండర్లకు ఆమోదం

ద్రాక్షారామ, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎటువంటి సమీక్ష జరుపలేదు. ఎజెండాలో పొందుపరచిన పలు టెండర్లకు సంబంధించి 9 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'జ్ఞానజ్యోతి'ని విజయవంతంగా అమలు చేయాలి



కె.గంగవరం పాఠశాలలో శిక్షణా తరగతులలో మాట్లాడుతున్న ఎంఈవో నాగరాజు



రాయవరంలో మాట్లాడుతున్న డీవైఈవో రామలక్ష్మణమూర్తి

కె.గంగవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో 120రోజులపాటు అమలుచేసే జ్ఞానజ్యోతి కార్యక్ర మాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవంతంగా అమలు చేయాలని ఎంఈవో 1 ఏ.నాగరాజు అన్నారు. జ్ఞానజ్యోతి కార్యక్రమం అమలు నిమిత్తం గత ఆరు రోజులుగా రెండు విడతలుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ మంగళ వారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈవో1 ఏ. నాగరాజు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు చురుకుగా ఉత్సాహవంతులుగా తీర్చిదిద్దాలని, చిన్ననాటి నుంచి నైతికవిలువలు నేర్పాలని వారిలో జ్ఞానజ్యోతులు వెలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీలు వెంకట్రావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్‌లు చంద్రకళ, అనురాధ, ప్రాధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

రాయవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఆరురోజుల నుంచి జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈకార్యక్రమంలో పాల్గొన్న రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న బోధన, అభ్యసన మెలకువలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆటపాటలతో చిన్నారులకు బోధన సాగిస్తే వారు చదువుపై ఆసక్తి కనబరుస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల భవిష్యత్తుకు దిక్సూచిగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇండస్ట్రీయల్ డిపార్ట్‌మెంట్ జీఎం పీకేపీ ప్రసాద్

రావులపాలెం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మహిళా సమాఖ్య కార్యాలయంలో జీఎం ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ ఎంఎస్ఎంఈ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇండస్ట్రీయల్ డిపార్టుమెంట్ జనరల్ మేనేజర్ వీకేపీ ప్రసాద్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శివశంకరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతంలో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుచేసుకుని డ్వాక్రా సంఘాల మహిళలకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ ప్రాంతంలో లభ్యమయ్యే అనేక ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు ఎగుమతులు అవుతున్న కారణంగా స్థానికంగా పరిశ్రమల ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ మందికి ఉపాధి కలుగుతుందన్నారు. ఈ సమావేశానికి హాజరైన వ్యాపారస్తులకు పరిశ్రమల ఏర్పాటుపై పలు సూచనలు చేశారు.

సప్తమాతృకలకు ఆలయ నిర్మాణం

మండపేట, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడిద సంఘమేశ్వరస్వామివారి ఆలయానికి కూతవేటు దూరంలో వున్న శ్రీరామచంద్రులపాదాల చెంతవున్న సప్త మాతృకలకు మండపేట పట్టణానికి చెందిన సూక్ష్మ చిత్రతయారీదారుడు దొంతంశెట్టి బాలనాగేశ్వరరావు దంపతులు దేవదాదాయశాఖ అనుమతితో చిరు దేవాలయంను నిర్మించారు. శివరాత్రి పర్వదినం పురష్కరించుకుని బుధవారం ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.



ఏడిదలో సప్తమాతృకలకు నిర్మించిన దేవాలయం



కపిలేశ్వరపురం: స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

● రథోత్సవాన్ని ప్రారంభించిన మంత్రి సుభాష్

● మహా శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు



కోటిపల్లిలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రథోత్సవంలో పాల్గొన్న మంత్రి సుభాష్

కె.గంగవరం, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలను కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారంరాత్రి ప్రారంభించారు. ఉత్సవాలను స్వామివారి రథోత్సవంతో ప్రారంభించారు. రథోత్సవం కోసం ఏర్పాటుచేసిన రథాన్ని పూలమాలలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి ఉత్సవమూర్తులను రథంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పెమ్మాడి బేబి, కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, కర్రి చిట్టిబాబు, రేవు శ్రీను, గొడవర్తి రామకృష్ణ, చీకట్ల సోమేష్, రాము, పెమ్మాడి సత్తిబాబు దేవస్థానం ఈవో భీమశంకరం, భక్తులు పాల్గొన్నారు.

రాయవరం: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆల యానికి అష్టదిక్కుల్లో ప్రతిష్ఠ చేసిన అష్ట సోమేశ్వర ఆలయాల్లో వాయువ్యంలో ఉన్న సోమేశ్వరం శ్రీబాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయం, పడమర దిక్కున ఉన్న వెంటూరు ఉమా సోమేశ్వరస్వామి ఆలయాలు మహా శివరాత్రి ఉత్స వాలకు ముస్తాబయ్యాయి. సోమేశ్వరంలో మహా శివరాత్రి ఉత్సవాలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఉత్సవ కమిటీ వారు తెలిపారు. శివాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు భక్తులకు మహా అన్న సమారాధన జరపనున్నారు. వెంటూరు, సోమేశ్వరం ఆలయాల్లో భక్తులకు తెల్లవారు జామునుంచే దర్శనాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేయడంతోపాటు సోమేశ్వర స్వామికి రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. భక్తులందరికీ స్వామి, అమ్మవారి దర్శనం కల్పించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైభవంగా త్రయంబకేశ్వరస్వామి కల్యాణం

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రిక ఉయ్యాల-జంపాల క్షేత్రంవద్ద ఉన్న శ్రీఅన్నపూర్ణ సమేత త్రయంబకేశ్వరస్వామివారి పదమూడవ వార్షిక కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కొమాళ్ళపల్లి సత్యనారా యణమూర్తి సిద్ధాంతి(సత్తిపండు)ఆధ్వర్యంలో కొత్తలంకవాసి కంఠం ప్రభాకరశర్మ బ్రహ్మత్వంలో ప్రధా న అర్చకుడు కొమాళ్ళపల్లి సత్యసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో స్వామివారికి గణపతిపూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహణం, పంచగవ్యం, అంకురారోపణ, ఊయల ఉత్సవం, కల్యాణోత్సవం వేదమంత్రోశ్చరణల నడుమ శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారి గ్రామోత్సవం బాజాభజంత్రీల నడుమ ఘనంగా నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా బుధవారం స్వామివారి ఆలయంవద్ద తీర్థమహోత్సవం, కాశీ అన్నపూర్ణ సన్నిధి నుంచి తెచ్చిన బియ్యంతో అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక గ్రామాల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వర్లు, అంగర, పడమరఖండ్రిక గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు

రావులపాలెం: శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పూర్తిచేశారు. రావులపాలెం మండలంలోని శివాలయాలవద్ద చలువ పందిర్లు, విద్యుత్ దీపాలంకరణలను ఏర్పాటుచేసి భక్తుల సౌకార్యర్థం క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

పార్వతీ పరమేశ్వర్ల కల్యాణం

ఆత్రేయపురం: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా వసంతవాడ పార్వతీ పరమేశ్వర్ల దివ్య క్షేత్రంలో స్వామి, అమ్మవార్లను పెళ్లికుమారుడు, కుమార్తెను చేశారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అంకుర్పారణ, ధ్వజారోహణం నిర్వహించి శివుడికి రుద్రహోమం నిర్వహించారు. అనంతరం మేళతాళ మంగళవాయిద్యాలతో స్వామివారి రథోత్సవం నిర్వహించారు. అనంతరం అశేష భక్తజనం స్వామివారి క ల్యాణోత్సవంలో పాల్గొన్నారు. పార్వతీ పరమేశ్వర్ల దివ్యకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శివుడికి అభిషేకాలు చేపట్టారు. బాణాసంచా కాల్పులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవా రం మహాశివరాత్రి కావడంతో ర్యాలీ ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసంఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో శివాలయాలను ముస్తాబు చేశారు.



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరం బాల త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి



అలమూరులో ఉన్న విక్రమభట్టీశ్వరస్వామి



ఆత్రేయపురం: వసంతవాడ పార్వతీపరమేశ్వర్లు

అలమూరు: విక్రమార్కరాజు ప్రతిష్ఠించిన ఆ లయానికి విక్రమార్కేశ్వరస్వామి, మంత్రి భట్టి చేతుల మీదుగా ప్రతిష్ఠించి శివలింగానికి భట్టీశ్వరస్వామి ఆలయాలు పేరు గాంచాయి. ఈ ఆలయాలు మొదట్లో పుట్టమట్టితో నిర్మించారని ఈ ఆలయాలు శిథిలావ్యస్థకు చేరడంతో పునర్ నిర్మాణం చేసినట్లు చెబుతున్నారు. ఇంత ఘన చరిత్ర కలిగిన ఈ ఆలయానికి అనేకమంది ప్ర ముఖులు వచ్చి దర్శించుకుంటారు. ఈనెల 26న ఈ ఆలయాలలో మహాశివరాత్రి ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ ఆర్.కృష్ణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈనెల 23నుంచి 28 వరకు వార్షి క కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.



ఉమామందేశ్వర, బ్రహ్మేశ్వర, నాగేంద్రస్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా ఉమామందేశ్వర, బ్రహ్మేశ్వర, నాగేంద్రస్వామివార్ల కల్యాణం

కొత్తపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మందపల్లి ఉమామందేశ్వర, ఉమా బ్రహ్మేశ్వర, ఉమా నాగేంద్రస్వామి వార్ల కల్యాణం సోమవారంరాత్రి వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివార్ల కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో కల్యాణాన్ని వైభవంగా విద్యుత్‌దీప కాంతులతో బాణాసంచా కాల్పులతో నిర్వహించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఐలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో పండితులు కల్యాణాన్ని నిర్వహించగా భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించండి



రావులపాలెంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులకు మద్దతు పలుకుతున్న నిరుద్యోగ జేఏసీ నాయకులు

రావులపాలెం,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా రావులపాలెం కొత్తకాలనీలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ గణేష్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, బండారు సంజీవ్, కేవీ సత్యనారాయణరెడ్డితో పాటు పలువురు కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు.

కూటమి అభ్యర్థికి నిరుద్యోగ జేఏసీ మద్దతు

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు నిరుద్యోగ జేఏసీ మద్దతు తెలుపుతున్నట్టు రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ తెలిపారు. రావులపాలెం టీడీపీ క్యాంప్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమేనని అన్నారు.

పేరాబత్తులను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం

కొత్తపేట: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ మీరాన్‌షరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తపేటలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మైనార్టీ ముస్లీం వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకుందని, మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 1756 మంది ఓటర్లు

రాయవరం: ఈనెల 27న జరిగే ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాయవరం మండలంలోని 12 గ్రామాలకు చెందిన 1756 మంది ఓటర్లు ఉన్నారని ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాయవరం తహశీల్దారు ఐవీ శెట్టి తెలిపారు. మంగళవారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ రాయవరం తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన 164వ పోలింగ్ కేంద్రంలో 892 మంది ఓటర్లు, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన 165వ పోలింగ్ కేంద్రంలో 864 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

ఆత్రేయపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పి.రాజేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయం, మండల ప్రాథమిక పాఠశాలలో 180, 181, 182 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని 1601 మంది పట్టభద్రులు ఓటు కలిగి ఉన్నారన్నారు.

రబీకి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం

● యర్రపోతవరం డీసీ సుబ్రహ్మణ్యేశ్వరరావు



కోరంగి చానల్ పనులు పరిశీలిస్తున్న యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు

కె.గంగవరం, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ర బీ పంటలో వరి పొలాలకు నీటిఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని యర్రపోత వరం డీసీ నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన కోరంగి చానల్‌పై సుమారు రూ.4లక్షలతో తూడు తొలగింపు పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలువ గట్లు చాలా చోట్ల బలహీనంగా ఉన్నాయి. వీటిని ఈ క్లోజర్‌లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని దీనిలోభాగం గా ఎక్కడ గట్టు బలహీనంగా ఉందో గుర్తిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కె.గంగవరం మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్, నిడదవోలు రవి, వాసంశెట్టి కృష్ణ తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో

అవిడి- జి.పెదపూడి వంతెన

● పొంచి ఉన్న పెనుప్రమాదం

● పట్టించుకోని ఆర్అండ్‌బీ శాఖ

కొత్తపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రెండు మండలాలకు వారధిగా గోరింకల డ్రైన్‌పై ఉన్న ఆర్అండ్‌బీ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో పెనుప్రమాదం పొంచి ఉంది. మండల కేంద్రమైన కొత్తపేట నుంచి పి.గన్నవరం వెళ్లేందుకు వీలుగా ఉండి అవిడి- జి.పెదపూడి వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు వంతెన కుంగిపోవడంతో పాటు రక్షణ గోడలు విరిగిపోయి పిల్లర్స్ పగులు తీసి ఉండ టంతో వాహనదారులు దగ్గరదారి కావడంతో దానిపైనే ప్రయాణిస్తున్నారు. సంబంధిత ఆర్అండ్‌బీ శాఖాధికారులు కనీస హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంతో పెద్దవాహనాల సైతం రాకపోకలు సాగిస్తుండటంతో పెనుప్రమాదం పొంచి ఉంది. దీనిని కనీసం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. దీని పటిష్టతను పరిశీలించి వాహనాలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేయాలని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టిసారించి రెండు మండలాలకు వారధిగా ఉన్న ఈ వంతెనను పునఃనిర్మించాలని లేకుంటే అప్పటివరకూ రాకపోకలు నిషేధించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన అవిడి- జి.పెదపూడి ఆర్అండ్‌బీ వంతెన, కుంగిన వంతెన

నా స్థలాన్ని ఆక్రమించారు

● వృద్ధురాలి ఆవేదన



రాజవరానికి చెందిన వృద్ధ మహిళ

ఆత్రేయపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నా స్థలాన్ని ఆక్రమించారు... నాపై దయచూపండి మహోప్రభో అంటూ కాళ్లరిగేలా కార్యాలయాలచుట్టూ తిరుగుతున్న ఆ వృద్ధ దంపతుల బాధలు వర్ణనాతీతం. ఆత్రేయపురం మండలం రాజవరానికి చెందిన నాయుడు నూకమ్మ, ఆమె భర్త వెంకటేశ్వరరావు వృద్ధాప్యంలో ఉన్నారు. వీరికి ఒక కుమార్తె. 2011 లో వాటర్ ట్యాంకు సమీపంలో సెంటున్నర స్థలం ప్రభుత్వం మంజూరు చేశారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో గూడు నిర్మించుకోలేక పరాయిపంచన పూరిగుడిసెలో జీవనం సాగిస్తున్నారు. మూడేళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో రేకుల షెడ్ వేసుకుని ఉండేందుకు స్థలం దగ్గరికి వెళ్లగా ఇరువైపులా ఉన్న వ్యక్తులు స్థలాన్ని ఆక్రమించుకుని నీకు స్థలం లేదంటూ నెట్టివేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌కు స్పందనలో వృద్ధ దంపతులు ఫిర్యాదు చేశారు. స్థానిక పంచాయతీ అధికారులు గ్రీవెన్స్ ఫిర్యాదును పరిశీలించి పరిష్కారమైనట్లుగా చూపించారు. ఈమేరకు ఆమె తహశీల్దారు కార్యాలయానికి వెళ్లి తమ గోడు చెప్పుకుంది. వయస్సు పైబడి పింఛన్ సొమ్ముతోనే జీవనం సాగిస్తున్నారు. ఆమెకు స్థలం ఇప్పించి గూడు నిర్మించాలని ఆమె వేడుకుంటుంది.

పంటకాల్వలో గుర్తుతెలియని మృతదేహం

మండపేట, ఫిబ్రవరి 25: (ఆంధ్రజ్యోతి) మండపేట తాపేశ్వరం రోడ్డులో వున్న పంటకాలువలో స్థానిక మెహర్ ఆశ్రమంవద్ద గుర్తుతెలియని మృతదేహంను మంగళవారం గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు గుర్తు తెలియని మృతుడి వయస్సు 30 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని భావిస్తున్నారు. మృతుడు 5.6 అడుగులు పొడవు, వంటిపై నలుపు కలర్ జీన్ ప్యాంట్ పింక్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. కాల్వలో లభ్యం అయిన మృతదేహంను స్థానిక మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రెండురోజులపాటు ఉంచుతున్నట్లు పట్టణ ఎస్.ఐ హరికోటి శాస్త్రి తెలిపారు. మరింత సమాచారం కోసం పట్టణ సీ.ఐ ఫోన్ నెం. 9440796597, పట్టణ ఎస్.ఐ 8332957526కు ఫోన్‌చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.